ప్రజాశక్తి

గురువారం 6 ఫిబ్రవరి 2025

5

అల్లూరి సీతారామరాజు



క్రీడాకారునికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి పాడేరు : గిరిజన క్రీడాకారులను ప్రోత్సహిస్తామని జిల్లా కలెక్టర్ ఎఎస్. దినేష్ కుమార్ అన్నారు. డుంబ్రిగుడ మండలం గేదెల బంద గ్రామానికి చెందిన అథ్లెటిక్స్, పరుగుపందెం క్రీడాకారుడు చెట్టి లోహిత్‌కు కలెక్టర్ కార్యాయంలో బుధవారం ఆర్థిక సహాయంగా అందించారు. లోహిత్ ఈనెల 9న విజయవాడలో జరుగుతున్న జాతీయ క్రీడల్లో పాల్గొనడానికి వెళుతున్నారు. అరకు వ్యాలీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో డిగ్రీ రెండవ సంవత్సరం చదువు కొనసాగిస్తూ ఇప్పటి వరకు రాష్ట్ర, జాతీయ స్థాయి పరుగుల పోటీలలో పాల్గొనని 35 గోల్డ్ మెడల్స్ సాధించానని లోహిత్ తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్‌కు . క్రీడాకారుడు తండ్రి సంజీవ్ కృతజ్ఞతలు తెలిపారు.



లోహిత్‌కు సాయం అందిస్తున్న జిల్లా కలెక్టర్

లేబర్ కోడ్స్‌ను రద్దు చేయాలి

సిఐటియు ఆధ్వర్యాన పలు చోట్ల నిరసనలు



రంపచోడవరం అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న దృశ్యం

ప్రజాశక్తి-రంపచోడవరం

లేబర్ కోడ్స్ బిల్లును రద్దు చేయాలని కోరుతూ కేంద్ర కార్మిక సంఘాలు పిలుపు మేరకు బుధవారం రంపచోడవరంలో సిఐటియు ఆధ్వర్యంలో నిరసన ర్యాలీ చేపట్టారు. స్థానిక సిపిఎం పార్టీ కార్యాలయం నుండి అంబేద్కర్ సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించి, అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సిఐటియు ఎఎస్ఆర్ రంపచోడవరం జిల్లా అధ్యక్షులు మట్ల వాణిశ్రీ మాట్లాడుతూ బ్రిటిష్ కాలం నుండి కార్మిక వర్గం పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలను కేంద్రంలోని మోడీ ప్రభుత్వం రద్దు చేసి, యజమానుల ప్రయోజనాలకు అనుకూలంగా నాలుగు లేబర్ కోడ్స్‌ను తీసుకొచ్చిందని తెలిపారు. దీని వల్ల కార్మిక వర్గం తీవ్రంగా నష్టపోతుందని, కనీస వేతనాలు అమలు కావని తెలిపారు. తక్షణమే లేబర్ కోడ్స్‌ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వివోఎల సంఘం జిల్లా కార్యదర్శి రామకృష్ణ, అంగన్వాడీ యూనియన్ నాయకురాలు రామలక్ష్మి, బషీరమ్మ, పాల్గొన్నారు.

రాజవొమ్మంగి : లేబర్ కోడ్స్‌ను రద్దు చేసి, కార్మిక చట్టాలను అమలు చేయాలని కోరుతూ సిఐటియు ఆధ్వర్యంలో రాజవొమ్మంగిలో కార్మికులు నిరసన చేపట్టారు. అనంతరం పలు డిమాండ్‌లతో వినతి పత్రాన్ని తహశీల్దారు అల్లు సత్యనారాయణకు అందజేశారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ఉపధ్యక్షులు పి.రామరాజు. మండల నాయకులు కె.వెంకటలక్ష్మి, టి.శ్రీను, సీహెచ్ వెంకటలక్ష్మి, ఎ అమ్మిరాజు మాట్లాడుతూ స్కీమ్ వర్కర్ల కనీస వేతనం రూ.26 వేలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిఐటియు మండల నాయకులు ఎస్ వీరబాబు, గిరిజన సంఘం నాయకులు కె.జగన్నాథం, అంగన్వాడీ, ఆశ యూనియన్ల నాయకులు చంద్రావతి, రత్నం, చిన్నమ్ములు, మంగ, సత్యవతి, సుందరమ్మ, సూర్యకుమారి కార్మికులు పాల్గొన్నారు.

అల్లూరి జిల్లా : కార్మిక చట్టాలను యథావిధిగా అమలు చేయాలని కోరుతూ అడ్డతీగల చేతబడి జంక్షన్ నుండి తహశీల్దారు కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించి, అక్కడ నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు నిర్మల, అంగన్వాడీ, ఆశా వర్కర్లు లింగామణి, ధనమ్మ, చిన్నలమ్మ, 108, మిడ్డేమీల్స్, విఒఎలు చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

వై.రామవరం : లేబర్ కోడ్లకు వ్యతిరేకంగా వై.రామవరం మెయిన్ సెంటర్ నుంచి మండల తహశీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించి, తహశీల్దార్‌కి వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు మండల కార్యదర్శి కె.శాంతిరాజు, ఆశా యూనియన్ నాయకులు కె.వీరలక్ష్మి, జె.నూకరత్నం. దాగారి పొట్టమ్మ, వెలుగు యానిమేటర్ల సంఘం నాయకులు మంగయమ్మ, చలివేది శ్రీకాంత్, వెలుగూరి సూర్యకాంతం, అంగన్వాడీ నాయకులు జి.విమల తదితరులు పాల్గొన్నారు.

దేవీపట్నం : సిఐటియు దేవీపట్నం మండల కార్యదర్శి కట్టుమూరు వీరబాబు ఆధ్వర్యంలో బుధవారం మండల తహశీల్దార్‌కి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు కే.పోచమ్మ, కే రాధ, కే నాగరత్నం, రామలక్ష్మి వివోలు పాల్గొన్నారు.

అల్లూరి జిల్లా : లేబర్ కోట్లను రద్దు చేయాలని కోరుతూ సిఐటియు ఆధ్వర్యాన బుధవారం చింతూరు బస్సు స్టాండ్ నుండి తహశీల్దారు కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించి, ఆందోళన చేపట్టారు. అనంతరం డిమాండ్‌లతో కూడిన వినతి పత్రాన్ని తహశీల్దారు చిరంజీవికి అందజేశారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంఘం జిల్లా నాయకులు సీసం సురేష్, సిఐటియు మండల ప్రధాన కార్యదర్శి పోడియం లక్ష్మణ్, కారం సుబ్బారావు. చింత రాంబాబు. బివి రమణ, అంగన్వాడీ నాయకులు నూకరత్నం, వెంకటరమణ, కనకదుర్గ, వసంత, ఆశ వర్కర్లు రవ్వ వీరమ్మ, మడకం శ్రీదేవి, దుర్గ, లక్ష్మి, వెలుగు వివోఏలు లీలావతి, కళావతి, స్కూల్ శానిటేషన్ వర్కర్లు పాల్గొన్నారు

విఆర్.పురం : మండలంలోని రేకపల్లి జంక్షన్ నుండి తహశీల్దారు కార్యాలయం ర్యాలీ నిర్వహించి, అక్కడ ధర్నా చేశారు. అనంతరం తహశీల్దారు సరస్వతికి వినతి పత్రం అందజేశారు. వీరికి ఎపి ఆదివాసీ గిరిజన సంఘం ఎఎస్ఆర్ రంపచోడవరం జిల్లా ప్రధాన కార్యదర్శి పులి సంతోష్ కుమార్, రైతు సంఘం నాయకులు సోయం చిన్నబాబు, పంకు సత్తిబాబు మద్దతు తెలియజేశారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు రాజేశ్వరి, సున్నం రంగమ్మ, ఈశ్వరి, కనకమహాలక్ష్మి, అలివేలు, శాటిలైజర్, మిడ్ డే మీల్స్ వర్కర్లు, ఉపాధి హామీ కూలీలు పాల్గొన్నారు.

కూనవరం : కేంద్ర కార్మిక సంఘాల పిలుపులో భాగంగా కూనవరం సిఐటియు కార్యాలయం నుండి స్థానిక తహశీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయంలో వినతి పత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ మండల కార్యదర్శి కొమరం పెంటయ్య, అధ్యక్షులు తాళ్లూరి శ్రీనివాసరావు, అంగన్వాడీ, ఆశా, వెలుగు, శానిటేషన్ నాయకులు రామకృష్ణ అన్నపూర్ణ, దుర్గ, రజిని, మణి పాల్గొన్నారు.



పాడేరు ఐటిడిఏ ఎదుట...

పాడేరు ఐటిడిఏ ఎదుట....

పాడేరు : లేబర్ కోడ్‌లను ఉపసంహరించాలని డిమాండ్ చేస్తూ దేశవ్యాప్తంగా సిఐటియు పిలుపుమేరకు అల్లూరి జిల్లా కేంద్రం పాడేరు ఐటిడిఏ ఎదుట బుధవారం సిఐటియు ఆధ్వర్యంలో కార్మిక వర్గాలు నిరసన చేపట్టాయి. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి వి. ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ.స్వాతంత్ర్యం ముందు నుంచి కార్మికవర్గం పోరాడి సాధించుకున్న 29 కార్మిక చట్టాలను కోవిడ్ కాలంలో దుర్మార్గంగా ఎటువంటి చర్చ జరగకుండా కేంద్రప్రభుత్వం రద్దుచేసిందన్నారు. 2019లో వేతనాల కోడ్, 2020లో పారిశ్రామిక సంబంధాల కోడ్, సామాభద్రత కోడ్, వృత్తి భద్రత, ఆరోగ్యం, పని పరిస్థితులు అంటూ నాలుగు కోడ్‌లను రెండురోజుల్లోనే రూపొందింపజేసి, రాష్ట్రపతితో ఆమోదింపజేసిందన్నారు. వీటి అమలుకు మోడీ ప్రభుత్వం సిద్ధంగా ఉందని, ఏక్షణాన్నైనా వీటి ఉత్తర్వులు వెలువడతాయన్న కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ ప్రీ బడ్జెట్ సమావేశంలో ప్రకటించారన్నారు. దీనిపై తీవ్రవ్యతిరేకత వ్యక్తమై, దేశవ్యాప్తంగా కార్మికలోకం నిరసనలు, ర్యాలీఉ చేపట్టిందన్నారు. తమకు జరిగిన అన్యాయాలపై తిరుగుబాటు చేయడం, ప్రశ్నించే హక్కు లేని విధంగా యాజమాన్యాలకు కార్మికులను కట్టుబానిసలను చేయాలన్న లేబర్‌కోడ్‌లను వెంటనే ఉపసంహరించాలని కోరారు. దీనిపై కార్మికలోకం ఉద్యమానికి సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి ఎల్ సుందరరావు, మండల కమిటీ సభ్యులు ముత్యాలమ్మ, శ్రీనివాస్,కార్మికులు పాల్గొన్నారు.

అరకులోయ రూరల్ : కార్మిక వ్యతిరేక లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ బుధవారం అరకులోయ గిరిజన మ్యూజియం కార్మికులు ఆధ్వర్యంలో గేటు ఎదుట నిరసన చేపట్టారు. పోరాడి సాదించుకున్న కార్మిక చట్టాలను నిర్వీర్యం చేసి, కార్మికులను వెట్టిచాకిరీ దారులుగా పెట్టుబడిదారులకు ఊడిగం చేయించేలా వ్యవహరించే కేంద్ర ప్రభుత్వంపై నిరసన వ్యక్తం చేశారు. ఎటువంటి నోటీసు ఇవ్వకుండా కార్మికులను తొలగించే అధికారం యాజమాన్యాలను ఇవ్వడం, పనిగంటలు పెంచి, శ్రమదోపిడికి గురిచేయడం వంటి విధానాలకు ఆస్కారం లేకుండా లేబర్‌కోడ్‌లను రద్దుచేయాలన్నారు. కనీస వేతనాలు అమలు, పనిభద్రత, సమానపనికి సమానవేతనం ఇతర డిమాండ్లను నెరవేర్చాలని కోరారు. నిరసనలో కార్మికులు తులసమ్మ, లక్ష్మి,రాజు పి, బాలకృష్ణ, కెరామారావు పాల్గొన్నారు.

సీలేరు : లేబర్ కోడలు రద్దు చేయాలని సీలేరు సిఐటియు కార్యాలయం ఎదుట యునైటెడ్ ఎలక్ట్రిసిటీ కాంటాక్ట్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యాన ఏపీ జెన్కో కాంట్రాక్ట్ కార్మికులు నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు ఎస్కె సుభాన్, విష్ణు కుమార్, కే బాపిరాజు, ఎస్ రమణ, ఎస్కే అబీబుల్లా, బాబా రమణ, ఎస్ దేవి, కే లక్ష్మి, పాల్గొన్నారు.



విఆర్.పురంలో...



రాజవొమ్మంగిలో...



సీలేరులో..



మాట్లాడుతున్న ఐటిడిఎ పిఒ కట్టా సింహాచలం

ఉపాధ్యాయులకు ప్రత్యేక శిక్షణ

- ఐటిడిఎ పిఒ కట్టా సింహాచలం

ప్రజాశక్తి-రంపచోడవరం

ఏజెన్సీలో వచ్చేనెల జరగబోవు పదవ తరగతి పరీక్షల్లో విద్యార్థులు నూరు శాతం ఉత్తీర్ణత సాధించే విధంగా సంబంధిత ఉపాధ్యాయులకు రెండు రోజులపాటు ప్రత్యేక శిక్షణ ఇవ్వడం జరుగుతుందని రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి కట్టా సింహాచలం పేర్కొన్నారు. బుధవారం స్థానిక ఐటీడీఏ కార్యాలయ సమావేశ మందిరంలో గిరిజన సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్, సహాయక గిరిజన సంక్షేమ శాఖ అధికారులు, అన్ని మండలాల ఎంఇఒలు, అన్ని గురుకులాల అధికారులతో ఐటిడిఎ పిఒ బుధవారం సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పిఒ సింహచలం మాట్లాడుతూ ఈ విద్యా సంవత్సరంలో ఏజెన్సీలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలలో చదువుతున్న పదవ తరగతి విద్యార్థులు నూటికి నూరు శాతం పాస్ అయ్యే విధంగా ఇప్పటి నుంచి విద్యార్థులకు ప్రత్యేక క్లాసులు నిర్వహించాలని ఆదేశించారు. ఈ విషయంపై ఈ నెల 6వ తేదీ గురువారం ఐటీడీఏ సమావేశ మందిరంలో సబ్జెక్ట్ ఉపాధ్యాయులకు, 7న శుక్రవారం సబ్జెక్టేతర ఉపాధ్యాయులకు రెండు రోజులపాటు ప్రత్యేక శిక్షణ ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. వెనుక బడిన విద్యార్థులను గుర్తించి వారికి వెనుకబడిన సబ్జెక్టులకు ప్రత్యేక క్లాసులు తీసుకోవాలని ఆదేశించారు. ప్రభుత్వ పాఠశాలలో మెనూ పక్కాగా అమలు చేయాలన్నారు. నిత్యవసర సరుకులు, పాలు గుడ్లు తదితరాలు వెండర్లు ఏవిధంగా సరఫరా చేస్తున్నదీ ఆరా తీశారు. వచ్చే విద్యా సంవత్సరానికి విద్యార్థులకు పుస్తకాలు, బట్టలు ఏర్పాటుకు నివేదికలు తయారీ సమర్పించాలని సూచించారు. ఈ సమావేశంలో గిరిజన సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ ఎ.విజయశాంతి, ఏజెన్సీ డీఈవో వై.మల్లేశ్వరరావు, సహాయక గిరిజన సంక్షేమ శాఖ అధికారులు రామతులసి, కృష్ణమోహన్, కె.సుజాత, ఎంఇఒలు రామకృష్ణ, ముత్యాలరావు, యస్.బాపిరాజు, వై.వెంకన్న, పి.శ్రీనివాసరావు, టి.సూరారెడ్డి, తాతబ్బాయి, బిఎస్ కుమార్, గురుకులం సెల్ అధికారి నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

అన్ని అనుమతులతోనే
బస్ షెల్టర్, మరుగుదొడ్ల నిర్మాణం

ప్రజాశక్తి-సీలేరు : జీకేవీధి మండలం సీలేరులో అన్ని అనుమతులతోనే బస్సు షెల్టర్, మరుగుదొడ్లు నిర్మాణం చేపడుతున్నామని స్థానిక సర్పంచ్ దుర్జో తెలిపారు. బుధవారం జరిగిన కాంగ్రెస్, వైసిపి నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎటువంటి అనుమతులు లేకుండా నిర్మిస్తున్నారని టిడిపి కూటమి నాయకులు చిటికెల రాము, వనముల రాము, గోవిందు బాలు చేసిన ఆరోపణలను సర్పంచ్ ఖండించారు. నిర్మాణపు అనుమతి పత్రాలు పత్రికా విలేకరుల సమక్షంలో చూపించామని తెలిపారు. జిల్లా కాంగ్రెస్ కార్యదర్శి కారె శ్రీనివాస్ మాట్లాడుతూ ఏపీ జెన్కో అనుమతులు, పంచాయతీ తీర్మానంతో ఎంపీ నిధులతో మార్కెట్ అభివృద్ధి చెందాలని ఉద్దేశంతో కాంగ్రెస్ పార్టీ సపోర్ట్ చేసిందని తెలిపారు. అనుమతులపై ఎవరికైనా అనుమానాలు ఉంటే పంచాయతీ కార్యాలయానికి వచ్చి చూసుకోవచ్చని స్పష్టం చేశారు. పంచాయతీ పరిధిలో అక్రమాలు జరుగుతున్నాయని కుటమి నాయకులు చేసిన ఆరోపణలపై విచారణ చేయించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు వానపల్లి అప్పారావు, సత్తిబాబు, వైసిపి నాయకులు వెంకట్రావు, పి సత్యనారాయణ, సిఐటియు గౌరవాధ్యక్షులు ఎస్కె సుభాన్ తదితరులు పాల్గొన్నారు.

11, 12 తేదీల్లో మన్యం బంద్

అఖిలపక్ష ప్రజా సంఘాల పిలుపు



బంద్‌పై సన్నాహక సమావేశంలో అఖిలపక్ష ప్రజా సంఘాల నేతలు

ప్రజాశక్తి -పాడేరు: పర్యాటకాభివృద్ధి పేరుతో ఏజెన్సీలో అమలు జరుగుతున్న 1/70 చట్టానికి సవరణలు చేయాల్సి ఉందని రాష్ట్ర శాసనసభ స్పీకర్ అయ్యన్నపాత్రుడు ఇటీవల చేసిన వ్యాఖ్యలపై రాష్ట్ర ప్రభుత్వం వైఖరి తక్షణమే ప్రకటించాలని డిమాండ్ చేస్తూ ఈనెల 11 12 తేదీల్లో మన్యం బంద్‌కు అఖిలపక్షాలు ప్రజా సంఘాలు పిలుపునిచ్చాయి బుధవారం స్థానిక విఆర్ కల్యాణ మండపంలో పాడేరు ఎమ్మెల్యే మత్స్యరాస విశ్వేశ్వరరాజు అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఏజెన్సీలో అన్యాక్రాంతమైన భూములను పంచడానికి సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని స్పెషల్ డిఎస్సి ప్రకటించాలని షెడ్యూల్డ్ ఏరియాలోని ఉద్యోగాలను స్థానిక గిరిజనులకు కల్పించేందుకు నియామక చట్టం చేయాలని తదితర డిమాండ్లను ఈ సమావేశంలో అఖిలపక్షాలు తీర్మానించి 11 12 తేదీల్లో మన్యం బందుకు సన్నద్ధమయ్యాయి.. సమావేశంలో అరకు ఎమ్మెల్యే రేగం మత్స్య లింగం, సిపిఎం జిల్లా కార్యదర్శి పి.అప్పల నర్స, సిపిఐ నాయకులు కూడా రాధాకృష్ణ, డిఎల్ఒ రాష్ట్ర అధ్యక్షుడు సమరెడ్డి మాణిక్యం, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి జీవన్ కుమార్, గిరిజన సంఘం నాయకులు పాలికి లక్కు, సీఐటీయూ సుందరరావు, ప్రజా సంఘాలు, రాజకీయ పార్టీల నేతలు మన్యంబంద్‌కు సన్నద్ధమౌతున్నాయి.

పిఎం జన్‌మన్ సర్వేకు
సరిపడా సిబ్బందిని కేటాయించాలి

ప్రజాశక్తి-ముంచింగిపుట్టు : మొదటి విడతగా కేంద్ర ప్రభుత్వ పిఎం జన్‌మన్ పథకంలో భాగంగా అర్హులైన పివిటిజి లబ్ధిదారుల గుర్తింపునకు మండల వ్యాప్తంగా గ్రామాల్లో చేపడుతున్న సర్వేకు సరిపడా సిబ్బందిని కేటాయించాలని సిపిఎం మండల కార్యదర్శి, లక్ష్మీపురం గ్రామపంచాయతీ సర్పంచ్ కుర్ర త్రినాథ్ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, పివిటిజేతర కులాల అర్హులైన వారందరినీ త్వరితగతిన సర్వేలు పూర్తిచేసి గహాలు మంజూరు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. పిఎంజన్‌మన్ పథకంలో మొదటి విడతలో పేర్లు రాని పివిటిజి లబ్ధిదారులను గుర్తించేందుకు ఈ నెల 11 వరకు సర్వే నిర్వహించాలనీ ప్రభుత్వం ఆదేశించిన నేపథ్యంలో సరిపడా సిబ్బంది కేటాయించాలన్నారు. సచివాలయ పరిధిలోని ఇంజనీరింగ్ అసిస్టెంట్లతో పాటు, వెల్ఫేర్ అసిస్టెంట్, డిజిటల్ అసిస్టెంట్, తదితర శాఖల వారిని గృహ నిర్మాణ అర్హత సర్వేలో వినియోగించి త్వరితగతిన సర్వేలు పూర్తి చేయాలని కోరారు. మండల పరిధిలో 23 గ్రామ పంచాయతీ పరిధిలో 370కి పైగా గ్రామాలు ఉన్నాయని, అన్నిగ్రామాల్లో సర్వేసజావుగా పూర్తి కావాలంటే ప్రస్తుతమున్న 18 మంది ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, ముగ్గురు హౌసింగ్ సిబ్బంది, ఒక ఎఇ ఎటూసరిపోరన్నారు. మరోవైపు మండలంలోని పలు ప్రాంతాల్లో సెలసిగ్నల్స్ సమస్యతో సర్వే, అర్హుల నమోదుకు సాంకేతిక సమస్యలు తలెత్తుతున్నాయన్నారు. అన్ని అంశాలను పరిగణనలోకి తీసుకుని, జన్‌మన్ సర్వేకు అవసరమైన సౌకర్యాలు, సాంకేతిక సదుపాయాలు సమకూర్చడంతోపాటు సరిపడా సిబ్బందిని నియమించాలని త్రినాథ్ కోరారు. గతంలో సర్వే చేసిన విధంగా మిగతా శాఖాల చివాలయ సిబ్బందినీ కేటాయిస్తే ప్రభుత్వం నిర్దేశించిన సమయంలో పూర్తి చేయుటకు అవకాశం ఉంటుదన్నారు.

సమస్యలపై అధికారులతో చర్చిస్తా

- రాష్ట్ర ఎస్‌టి కమిషన్ చైర్మన్ డివిజి.శంకరరావు
- దీక్షాశిబిరాల సందర్శన : అండగా ఉంటామని భరోసా

ప్రజాశక్తి- డుంబ్రిగుడ: గిరిజనుల సమస్యలపై అధికారులతో చర్చించి, వాటి పరిష్కారానికి చర్యలు చేపడతామని ఎస్‌టి కమిషన్ చైర్మన్ , మాజీ ఎంపీ డివిజి.శంకరరావు అన్నారు. బుధవారం మన్యంలో పర్యటించారు. పలు దీక్షాశిబిరాలను సందర్శించి, బాధితుల సమస్యలను విన్నారు. వాటిపై అధికారులో చర్చించి, తగు చర్యలకు ఆదేశిస్తానన్నారు. డంబ్రిగుడలో ఏకలవ్య పాఠశాల భవనాల నిర్మాణానికి సాగు భూములిచ్చిన తమకు న్యాయం చేయాలని కోరుతూ భూదాతలు చేపడుతున్న దీక్షాశిబిరాన్ని సందర్శించారు బాధితుల సమస్యలను విని, వారి నుంచి వినతిపత్రాన్ని స్వీకరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బాధితులకు ఉపాధి కల్పించేంత వరకు ఎస్‌టి కమిషన్ అండగా ఉంటుందని భరోసానిచ్చారు సాగు భూములు తీసుకుని ఏడేళ్లవుతున్నా బాధిత గిరిజనులకు న్యాయం చేయకుండా తాత్సారం తగదన్నారు. దీనిపై జిల్లాకలెక్టర్, కమిషనర్‌కు నివేదిస్తామన్నారు. అంతకుముందు దీక్షాశిబిరాన్ని కాంగ్రెస్ రాష్ట్ర నాయకురాలు శాంతకుమారి, సీపీఎం మండల కార్యదర్శి పోతురాజు సందర్శించి, సంఘీభావం ప్రకటించారు.

కమిషన్ దృష్టికి భూఆక్రమణల సమస్యలు

హుకుంపేట: రాష్ట్ర ఎస్‌టి కమిషన్ దృష్టికి భూఆక్రమణలు, అక్రమ నిర్మాణాల సమస్యలను తీసుకెళ్లినట్లు ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా ఉపాధ్యక్షులు టి.కృష్ణారావు తెలిపారు. తనకు న్యాయం చేయాలని మండల కేంద్రంలో గంపరాయి బాలప్రభ అనే గిరిజన మహిళ పదిరోజులుగా చేపడుతన్న దీక్షాశిబిరాన్ని బుధవారం రాష్ట్ర ఎస్‌టి కమిషన్ ఛైర్మన్ డాక్టర్ డివిజి శంకరరావు, కమిషన్ సభ్యులు జంపరంగి లిల్లి సురేష్, కొర్ర రామలక్ష్మి సందర్శించారు. గిరిజన మహిళ సమస్యను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మండలంలో రాజకీయ నేతల అండదండలతో గిరిజనేతరుల దురాక్రమణలు, అక్రమ నిర్మాణాలను వివరించినట్లు కృష్ణారావు తెలిపారు. ఐదవ షెడ్యూల్, ఇతర గిరిజనచట్టాలు, ఏజెన్సీ నిబంధనలను ఉల్లంఘించి, దళారులు, మధ్యవర్తుల ప్రమేయంతో యథేచ్ఛగా భూలావాదేవీలు, క్రయవిక్రయాలు నిబంధనలకు విరుద్ధంగా చేస్తున్నారని, దీనికి రెవెన్యూ అధికారులు దన్నుగా ఉంటున్నారని విన్నవించారు. దీనిపై గిరిజన సంఘం ఆధ్వర్యంలో అధికారులకు అనేకమార్లు విన్నవించినా ఎటువంటి స్పందన లేదని ఆవేదన వెలిబుచ్చారు దీనిపై ఎస్‌టి కమిషన్ చైర్మన్ శంకరరావు సానుకూలంగా స్పందించారని, సమస్యలపై అధికారులతో మాట్లాడి, తర్వాత వివరిస్తానని స్పష్టం చేశారన్నారు.



ఆందోళనకారుల నుంచి వినతులు స్వీకరిస్తున్న డివిజి.శంకరరావు

నాణ్యమైన కాఫీకి అధిక ధర చెల్లించండి

- లక్ష ఎకరాల్లో కాఫీ తోటల పెంపకానికి ప్రణాళికలు
- 75 వేల ఎకరాల్లో కాఫీ పునరుద్ధరణ : జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్

ప్రజాశక్తి -పాడెరు : నాణ్యమైన కాఫీని సరఫరా చేసిన రైతులకు అధిక ధరలు చెల్లించాలని జిల్లా కలెక్టర్ ఎఎస్. దినేష్ కుమార్ ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఎఇఒలు, హార్టికల్చర్ కన్సల్టెంట్లు, ఫీల్డు కన్సల్టెంట్లులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ చింతపల్లి, జికె.వీధి మండలాల్లో ఆర్గానికి కాఫీ పండిస్తున్నో రైతుల వద్ద ఉన్న కాఫీ నిల్వలను గుర్తించి సేకరించాలని ఆదేశించారు. జి.సిసి, మాక్స్ సంస్థలు గిరిజన రైతులకు అంతర్జాతీయ మార్కెట్ ధరలను చెల్లించాలని సూచించారు. కాఫీ సిబ్బంది, జిసిసి, ఉద్యానవన శాఖ సిబ్బంది సంయుక్తంగా గిరిజన రైతులు పండిస్తున్న పసుపు, మిరియాలు మంచి గిట్టుబాటు ధరలకు కొనుగోలు చేయాలని స్పష్టం చేసారు రైతు ఉత్పత్తిదారుల సంఘాలను ఏర్పాటు చేసి గిరిజస ఉత్పత్తులు సేకరించేలా చర్యలు చేపట్టాలన్నారు.

రైతు ఉత్పత్తి దారుల సంఘాల నుండి జిసిసి, మాక్స్ కొనుగోలు చేయాలని సూచించారు. . రానున్న ఐదేళ్లలో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో లక్ష ఎకరాల్లో కాఫీ విస్తరణకు, 75 వేల ఎకరాల్లో పాత కాఫీ తోటలు పునరుద్ధరణకు అవసరమైన ప్రణాళికలు సిద్ధం చేయాలన్నారు. మాక్స్ సంస్థను బలోపేతం చేయాలన్నారు. ఈ ఏడాది నిర్దేశించిన కాఫీ సేకరణ జరగలేదని ఆగ్రహం వ్యక్తం చేసారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ డాక్టర్ ఎం.జె. అభిషేక్ గౌడ, ఐటిడిఎ ఎపిఒ ఎం. వేంకటేశ్వరరావు, జిల్లా ఉద్యాసవన అధికారి ఎ రమేష్‌కుమార్ రావు, కాఫీ సహాయ సంచాలకులు అప్పలనాయుడు, కాఫీ బోర్డు ఎస్ఎల్ఒ రమేష్,ఎఇఒలు, హార్టీకల్చర్ కన్సల్టెంట్లు, ఫీల్డు కన్సల్టెంట్లు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ దినేష్‌కుమార్

నేరాల నియంత్రణలో మహిళా పోలీసులు కీలకం

- శాంతిభద్రతల పరిరక్షణకు నిరంతరం అప్రమత్తం
- పాడేరు డిఎస్‌పి షేక్ షాహాబాజ్ అహ్మద్

ప్రజాశక్తి-పాడేరు టౌన్: మహిళా పోలీసులు క్షేత్రస్థాయిలో సమర్థంగా పనిచేయాలని, నేరాల నియంత్రణలో మహిళా పోలీసులు కీలకమని పాడేరు డిఎస్‌పి షేక్ షాహాబాజ్ అహ్మద్ అన్నారు. బుధవారం పాడేరులో పోలీసు కాన్ఫరెన్స్ హల్లో పాడేరు, హుకుంపేట మండలాలకు చెందిన మహిళ పోలీసులతో సమావేశం నిర్వహించారు. శాంతి భద్రతల పరిరక్షణకు నిరంతరం అప్రమత్తంగా ఉండాలని చెప్పారు. గంజాయి రవాణా, సాగు చేయడం నేరమని, సైబర్ నేరాలు, రోడ్డు ప్రమాదాల నివారణపై ప్రజలకు విస్తతంగా అవగాహన కల్పించాలన్నారు. శాంతి భద్రతల పరిరక్షణ, నేర నియంత్రణకు అవసరమైన సమాచారాన్ని స్థానిక పోలీసు అధికారులకు తెలియజేయాలని సూచించారు. మద్యం బెల్ట్ దుకాణాలు, జూదం వంటి అసాంఘిక కార్యకలాపాలపై నిఘా పెట్టి నియంత్రించేందుకు కషి చేయాలన్నారు. నాటు సారా, బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించడం జరుగుతుంటే అధికారుల దష్టికి తీసుకురావాలని చెప్పారు. సైబర్ నేరాలు, ట్రాఫిక్, గహహింస నేరాలపై గ్రామాలలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. శాంతి భద్రతలకు సంబంధించి సమాచారాన్ని ముందస్తుగా తెలియజేయాలన్నారు. కార్యక్రమంలో పాడేరు, హుకుంపేట సిఐలు డి.దీనబందు, ఎస్.సన్యాసినాయుడు పాల్గొన్నారు



సమావేశంలో మాట్లాడుతున్న డిఎస్‌పి అహ్మద్



ఎంపిడిఒకు విన్నవిస్తున్న గ్రామస్తులు

గొంతెండుతోంది... తాగునీరివ్వండి

ప్రజాశక్తి -డుంబ్రిగుడ: మండలంలోని గుంటసీమ పంచాయతీ సరియాపల్లి గ్రామంలో సురక్షితమైన తాగునీటి సౌకర్యం కల్పించి, దాహార్తి తీర్చాలని కోరుతూ ఆదివాసీ గిరిజన సంఘం ఆధ్వర్యంలో ఆ గ్రామస్తులు బుధవారం ఎంపిడిఒ ప్రేమ్ సాగర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు టి సూర్యనారాయణ మాట్లాడుతూ ఆ గ్రామంలో తాగునీటి సౌకర్యం లేక గ్రామస్తులు పొలంలోని కలుషిత ఊట నీటిని సేకరించి తాగుతున్నారన్నారు. దీని వల్ల వ్యాధుల బారిన పడి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సరియాపల్లిలో తాగునీటి ఇక్కట్లపై .పలు మార్లు సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే అధికారులు స్పందించి గ్రావిటీ పథకం మంజూరు చేసి సురక్షితమైన తాగునీటి సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు.కార్యక్రమంలో గిరిజన సంఘం మండల నాయకుడు పి తిలక్, టి రామదాస్, శ్రీనివాసరావు,ఆ గ్రామస్తులు పాల్గొన్నారు.



రైతులకు సూచనలు చేస్తున్న వ్యవసాయ శాస్త్రవేత్తలు

వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చడమే లక్ష్యం

ప్రజాశక్తి - చింతపల్లి : వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చేందుకు వ్యవసాయ విస్తరణ ద్వారా నిర్వహిస్తున్న పొలం పిలుస్తుంది కార్యక్రమాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని స్థానిక ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం శాస్త్రవేత్తలు డాక్టర్ పి బాల హుస్సేన్ రెడ్డి, ఎ.జోగారావు అన్నారు. బుధవారం మండలంలోని గొందిపాకల గ్రామంలో మండల వ్యవసాయ అధికారి మధుసూదనరావు తో కలిసి వారు పర్యటించారు. నీటి వసతి కలిగి పొలాల్లో వరి నాటుతున్న రైతులకు ఎరువులు, నీటి యాజమాన్యంపై తగు సూచనలు చేశారు. చాలామంది రైతులు తక్కువ రసాయన ఎరువులను వాడి పంటలను సాగు చేస్తున్నందువలన రాబోయే ఖరీఫ్ సీజన్లో రసాయన ఎరువులకు బదులు జీవన ఎరువులను ఎక్కువగా రైతు సేవా కేంద్రాల ద్వారా సరఫరా చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు వ్యవసాయ అధికారి మధుసూదనరావు తెలిపారు. గ్రామస్తుల సహకారంతో పంట వ్యర్థాలను వర్మీ కంపోస్ట్‌గా మారుస్తున్న గ్రామ వ్యవసాయ సహాయఅధికారి శోభన్ కృషిని వారు అభినందించారు. యువ రైతులు సెగ్గె సింహాచలం, అమ్మత తమ సొంత నిధులతో కాఫీ పండ్ల ప్రాసెసింగ్ యూనిట్‌ను నెలకొల్పి ఇతర రైతుల పంటలను కూడా ప్రాసెసింగ్ చేయడం ద్వారా అధిక మార్కెటింగ్ ధర లభించే దానికి చేస్తున్న కృషిని శాస్త్రవేత్తలు అభినందించారు. కార్యక్రమంలో అభ్యుదయ రైతు కుశలవుడు , గొందిపాకల గ్రామ రైతులు పాల్గొన్నారు.

వైద్యసేవలు మృగ్యం

- వైద్యాధికారుల కొరతతో రోగుల అగచాట్లు

- మన్యవాసుల వైద్యకష్టాలు పట్టని అధికారులు

ప్రజాశక్తి-పెదబయలు : గిరిజన ప్రాంతాల్లోని పిహెచ్‌సిలు, ఆసుపత్రులు నుంచి వైద్యులు, ఇతర సిబ్బందిని డెప్యుటేషన్ వేయడం వల్ల మన్యంలో వైద్యసేవలు మృగ్యమౌతున్నాయని ఏజెన్సీ వాసులు ఆవేదన చెందుతున్నారు. డిప్యుటేషన్లను రద్దుచేసి, ఆయా వైద్యులను పూర్వపు స్థానాల్లో నియమించడంతోపాటు ఎపిడమిక్ సీజన్‌లో మరింత మంది వైద్యులు, సిబ్బందిని నియమించి వైద్యసేవలను మెరుగుపరచాలని కోరుతున్నారు.

మండలంలో మూడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలుండగా రూడకోట,గోమంగి పిహెచ్‌సిలకు డిడిఒలుగా వ్యవహరిస్తున్న వైద్యాధికారులను, అలాగే, ముంచింగిపుట్టు మండలం లుబ్బూరు ప్రాథమిక కేంద్రాల్లో విధులు నిర్వర్తిస్తున్న వైద్యాధికారులను డిప్యుటేషన్ వేయడంతో ఆయా పిహెచ్‌సిల్లో వైద్యసేవలు మృగ్యమౌతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. సీజనల్ వ్యాధులు ప్రబలుతుండటంతో రోగులకు వైద్యసేవలు అందించే దిక్కులేకుండా పోయిందని అంటున్నారు. పిహెచ్‌సికి కనీసం ఇద్దరు వైద్యులు ఉంటే, వారిలో ఒకరు పిహెచ్‌సిలో అందుబాటులో ఉండి అక్కడకు వచ్చే రోగులకు వైద్యసేవలు అందిస్తారని, మరో వైద్యాధికారి క్షేత్రస్థాయిలో గ్రామాలకు వెళ్లి వైద్యసేవలు అందిస్తే ప్రయోజనకరంగా ఉంటున్నారు.

పెదబయలు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఇద్దరు వైద్యుల్లో ఒకరు శిక్షణకు వెళ్లగా, ప్రస్తుతం ఒక్కరే విధులు నిర్వర్తిస్తున్నారు సరిహద్దులో ఆంధ్రాఒడిశా గ్రామాల నుంచి గిరిజన రోగులు ఎక్కువగా ఇక్కడకు వైద్యసేవలుకు వస్తుంటారన్నారు.గోమంగి, రూడకోట, లబ్బూరులో ఇద్దరేసి వైద్యాధికారులు ఉండగా,వారిలో ఒక్కొక్కరినీ డెప్యుటేషన్‌పై ఇక్కడ వైద్యసేవలను సంబంధిత అధికారులు కావాలనే మృగ్యం చేశారని గిరిజనులు మండిపడుతున్నారు. డెప్యుటేషన్‌పై వెళ్లిన వైద్యాధికారులు ఆయా పిహెచ్‌సిల డిడిఒలు కావడంతో ఇక్కడ సిబ్బంది ఇబ్బందులు పడుతుండగా, మరోవైపు వారి సేవలను పర్యవేక్షించేవారు లేకుండా పోయారనే అపవాదు ఉంది. సంబంధిత అధికారులు స్పందించి తక్షణమే డిప్యుటేషన్ రద్దు చేసి, వైద్యులను పూర్వపుస్థానాల్లో నియమించి, వైద్యసేవలను మెరుగుపరచాలని కోరారు. వెంటనే తగు చర్యలు లేకుంటే జిల్లా కలెక్టరేట్ వద్ద ఆందోళన చేస్తామని హెచ్చరిస్తున్నారు.

పిల్లల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ

10న డీవార్మింగ్ డేను జయప్రదం చేయండి : జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్



వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ దినేష్‌కుమార్

ప్రజాశక్తి-పాడేరు: పిల్లలలో నులిపురుగుల నివారణకు ఆల్బెండజోల్ మాత్రలు మింగించాలని జిల్లా కలెక్టర్ ఎఎస్. దినేష్‌కుమార్ అన్నారు. బుధవారం కలెక్టరేట్ నుండి వైద్యాధికారులు, ఎంపిడిఒలు, ఐసిడిఎస్ అధికారులు, విద్యాశాఖాధికారులు, గిరిజనసంక్షేమ విద్యాధికారులతో డీవార్మింగ్‌పై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈనెల 10 వ తేదీన జాతీయ నులిపురుగుల దినోత్సవం సందర్భంగా 3లక్షల 35 మందికి డీ మార్మింగ్ మాత్రలు వేయడానికి లక్ష్యంగా నిర్దేశించామన్నారు. 3.68 లక్షల మాత్రలు విద్యా సంస్థలకు పంపిణీ చేస్తామన్నారు. 19ఏళ్ల వయస్సు లోపు పిల్లలందరికి ఆల్బెండజోల్ మాత్రలను చప్పరించి మింగించాలని సూచించారు.. ఇంకా ఎవరైనా మాత్రలు వేసుకోకుంటే 17న మాప్-అప్ రోజున మాత్రలు వేయించాలని సూచించారు. పిల్లల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ అవసరమన్నారు.

పాఠశాలలకు వెళ్లని పిల్లలకు, కిశోర బాలలకు అంగన్వాడీ కేంద్రాలలో మాత్రలు అందుబాటులో ఉంటాయని, తప్పని సరిగా వేయించాలని చెప్పారు. డీవార్మింగ్ ప్రక్రియలో ఎంపిడిఒలు కీలకపాత్ర పోషించాలని ఆదేశించారు. ఎంపిపి పాఠశాలలు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలు, గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలు, జూనియర్ కళాశాలలు, డిగ్రీకళాశాలల్లో 10 ఏళ్లలోపు పిల్లలందరికి ఆల్బెండజోల్ మాత్రలు చప్పరించాలని సూచించారు. . పివిటిజి పిల్లలు, గిరి శిఖర గ్రామాల్లో ఉన్న పిల్లలపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలన్నారు.చిన్న పిల్లలకు అరమాత్ర పొడి చేసి మింగించాలన్నారు. పూర్తి సమాచారం కోసం ఏ ఎన్ ఎం, ఆశా, అంగన్వాడీ కార్యకర్తలను సంప్రదించాలని చెప్పారు. అంతకు ముందు జాతీయ నులిపురుగుల నివారణ వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ డాక్టర్ ఎంజె అభిషేక్ గౌడ, రంపచోడవరం పిఒ కే సింహాచలం,జిల్లా వైద్యాధికారి డా. జమాల్ భాషా, ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్. విశ్వమిత్ర, డిసిహెచ్ఎస్ డాక్టర్ కృష్ణారావు, డిఇఒ బ్రహ్మాజీ రావు , ఆర్‌బిఎస్‌కె ప్రోగ్రాం మేనేజర్ కిషోర్, డిప్యూటీ డిఎంహెచ్‌ఒలు, ఎంపిడిఒలు, ఐసిడిఎస్ అధికారులు పాల్గొన్నారు.

ఆశ్రమ పాఠశాలను సందర్శించిన ఎంఇఒ

ప్రజాశక్తి-పెదబయలు: స్థానిక గిరిజన సంక్షేమ బాలుర రెసిడెన్సియల్ పాఠశాలను మండల విద్యాశాఖధికారి కొమ్ము కృష్ణమూర్తి బుధవారం సందర్శించారు. సోషల్ ఆడిట్ పర్యవేక్షణలో భాగంగా పరిశీలన జరిపి, పనులు వేగవంతం చేయాలని ఆదేశించారు. అనంతరం పదవ తరగతి విద్యార్థుల స్పెషల్ టెస్ట్‌ను పరిశీలించారు. పరీక్షలను ఆసాంతం పర్యవేక్షించి, విద్యార్థులకు కొన్ని ప్రశ్నలు వేశారు. పబ్లిక్ పరీక్షలంటే భయం వీడాలని, బాగాచదివి, మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించాలని ఆకాంక్షించారు.



టెన్త్ విద్యార్థుల పరీక్షలను పర్యవేక్షిస్తున్న ఎంఇఒ కృష్ణమూర్తి

నేరాలు ఘోరాలు

ఆవును ఢీకొని ఆటో బోల్తా

- చిరు వ్యాపారులకు తీవ్ర గాయాలు

ప్రజాశక్తి -డుంబ్రిగుడ: మండలంలోని కించుమండ పంచాయతీ కేంద్రంలో సాయంత్రం అడ్డంగా వచ్చిన ఆవును ఆటో ఢీకొన్న ఘటనలో చిరు వ్యాపారులకు తీవ్ర గాయాలయ్యాయి. దీనికి సంబంధించి వివరాలివి. మండలంలోని పోతంగి పంచాయతీ పనసపుట్టు మోడల్ కాలనీ గ్రామానికి చెందిన గిరిజనులు గాజుల వ్యాపారం చేస్తుంటారు.బుధవారం కించుమండలో వారపు సంతలో గాజులు వ్యాపారం చేసుకున్న వారు, సాయంత్రం తిరుగు ప్రయాణంలో స్వగ్రామానికి చేరుకునేందుకు ఆటోను ఆశ్రయించారు. అయితే ఆటోలో ప్రయాణించే సమయంలో పంచాయతీ కేంద్రానికి సమీపంలోని జాతీయ రహదారిలో ఆవు అడ్డంగా రావడంతో ప్రమాదవశాత్తు ఆటో ఢీకొట్టి బోల్తా పడింది. ఆటోలో ప్రయాణిస్తున్న చిరు వ్యాపారులు చెల్లా చెదురుగా పడడంతో తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు గమనించి క్షతగాత్రులను సపర్యలు చేశారు. 108కు సమాచారమిచ్చినా రావడంలో ఆలస్యంతో ప్రైవేటు వాహనాలను ఆశ్రయించి క్షతగాత్రులను ఆసుపత్రికి తరలించారు. ఆటో ప్రమాదంలో గొల్లోరి త్రినాధ్ కుడి కాలు విరిగిపోయింది. సమాచారం తెలుసుకున్న పోలీసులు హుటాహుటిన సంఘటన స్థలానికి చేరుకుని, ప్రమాదంపై ఆరా తీస్తున్నారు.

వ్యక్తి ఆత్మహత్య

ప్రజాశక్తి - ఆరిలోవ : వ్యక్తి ఫ్యాన్‌కు ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన ఆరిలోవ టిఐసి పాయింట్ వద్ద బుధవారం చోటు చేసుకుంది. దీనికి సంబందించిన వివరాలు ఇలా ఉన్నాయి. ముచ్చు శ్రీనివాసరావు, భార్య లావణ్యతో కలిసి ఆరిలోవలో నివాసముంటున్నారు. బుధవారం తెల్లవారు జామున ఇంట్లో ఎవరూ లేని సమయంలో శ్రీనివాసరావు ఫ్యాన్‌కు బెడ్ షీట్‌తో ఉరేసుకున్నాడు. భార్య లావణ్య విధులు నిర్వర్తించుకొని తెల్లవారు జామున ఇంటికొచ్చేసరికి తలుపులు తాళం వేసి ఉన్నాయి. వెనుక వైపు నుంచి వెళ్లగా గదిలో ఫ్యాన్‌కు ఉరేసుకొని శ్రీనివాసరావు కనిపించాడు. స్థానికుల సహాయంతో కిందికి దింపి చూడగా అప్పటికే శ్రీనివాసరావు మృతి చెందాడు. భార్య లావణ్య, కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఆరిలోవ పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కెజిహెచ్‌కు తరలించారు.



అంబులెన్సులను ప్రారంభిస్తున్న జిల్లా కలెక్టర్ దినేష్‌కుమార్

అంబులెన్స్‌లు ప్రారంభం

ప్రజాశక్తి-పాడేరు : ప్రముఖ సినీ నటుడు సోనూసూద్ తన సోనూసూద్ ఫౌండేషన్ వితరణ చేసిన రెండు అంబులెన్సులను జిల్లా కలెక్టర్ ఎఎస్.దినేష్ కుమార్ బుధవారం కలెక్టరేట్ వద్ద జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సోనూసూద్ ఫౌండేషన్ వితరణ చేసిన రూ. 26 లక్షల విలువైన రెండు అంబులెన్సులను రాష్ట్ర ప్రభుత్వం అల్లూరి సీతారామరాజు జిల్లాకు కేటాయించిందన్నారు. పాడేరు డివిజన్ పరిధిలోని రూడకోట, రాజేంద్రపాలెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు కేటాయించాలని అధికారులకు సూచించారు. అంబులెన్సులు నిరంతరం రోగులకు అందుబాటులో ఉండాలని, దాతల ఇచ్చిన స్ఫూర్తి మేరకు వాటి సేవలను రోగులకు అందించాలని సూచించారు. అత్యవసర సమయంలో రోగులకు వైద్య సేవలు అందించడానికి వీటి సేవలు వినియోగించాలని స్పష్టం చేసారు.



ఉపాధి హామీ కూలీలతో మాట్లాడుతున్న ఎపిఒ శ్రీనివాస్

ఉపాధి హామీ పనుల పరిశీలన

ప్రజాశక్తి-కొయ్యూరు : నూతనంగా బాధ్యతలు స్వీకరించిన ఎన్ఆర్ఇజిఎస్ ఏపీవో శ్రీనివాస్ మండలంలోని చీడిపాలెం పంచాయతీలో జరుగుతున్న ఉపాధి హామీ పనులను బుధవారం పరిశీలించారు. కూలీల హాజరు, పని జరిగే తీరును పర్యవేక్షించారు. అనంతరం మండల కేంద్ర కార్యాలయంలో టిఏలు, ఎఫ్ఏలతో రివ్యూ సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పనులు అడిగిన 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరికీ జాబు కార్డు మంజూరు చేయాలని ఆదేశించారు. పని కోరిన వారికి ఆధార్ కార్డు, బ్యాంక్ అకౌంట్ పత్రాలు ఉండాలన్నారు. ఉపాధి హామీ పనులు కల్పనలో అలసత్వం వహించినా, మస్టర్లు వేసే విషయంలో అవకతవకలకు పాల్పడినా శాఖా పరమైన చర్యలు తప్పవంటూ హెచ్చరించారు.

సిఆర్‌పి సతీష్‌కు సన్మానం

ప్రజాశక్తి-రాజవొమ్మంగి : గణతంత్ర దినోత్సవం సందర్భంగా బెస్ట్ క్లస్టర్ రిసోర్స్ పర్సన్‌గా ప్రశంసా పత్రం పొందిన మండలంలోని బొర్నగూడెం స్కూల్ కాంప్లెక్స్ పరిధి సిఆర్‌పి చవలం సతీష్‌ను బోర్నగూడెం బాలుర ఆశ్రమ ఉన్నత పాఠశాలలో బుధవారం ఘనంగా సత్కరించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుల ఎస్ రమేష్ బాబు ఆధ్వర్యంలో జరిగిన అభినందన సభలో రమేష్‌కు సిబ్బంది పూలమాలలు వేసి దుస్సాల్వాలతో ఘనంగా సన్మానించారు. ఆయన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో రికార్డు అసిస్టెంట్ గొర్ల రాఘవ, జూనియర్ అసిస్టెంట్ సుశీల, పాఠశాల ఉపాధ్యాయులు బొడరాపు కృష్ణ, దుంప వరప్రసాద్, శివ ప్రసాద్, పాండు స్వామి, గణన దొర, సతీష్, విజయబాబు, విశ్వనాథరెడ్డి, పాపారావు, బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

కూటమి అభ్యర్థి విజయానికి కృషి చేయాలి

ప్రజాశక్తి-రంపచోడవరం : ఉభయ గోదావరి పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో టిడిపి కూటమి అభ్యర్థి పేరా బత్తుల రాజశేఖరం విజయానికి కూటమి నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని రాష్ట్ర మహిళా సంక్షేమం, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణి పిలుపునిచ్చారు. ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో బుధవారం రంపచోడవరం నియోజకవర్గం 11 మండలాలకు చెందిన టిడిపి, బిజెపి, జనసేన పార్టీలకు చెందిన ముఖ్య నేతలతో ఎమ్మెల్యే మిర్యాల శిరీష దేవి అధ్యక్షతన బుధవారం రంపచోడవరం సమావేశం నిర్వహించారు.

దుర్గాలమ్మ ఉత్సవాలకు విస్తృత ఏర్పాట్లు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : పూర్ణామార్కెట్ సమీపంలోని శ్రీ దుర్గాలమ్మ అమ్మవారి వార్షిక జాతరోత్సవ వేడుకలకు విస్తృత ఏర్పాట్లు చేస్తున్నట్లు జిల్లా రెవెన్యూ అధికారి పి. శ్రీలేఖ చెప్పారు. బుధవారం దేవస్థానంలో జరిగిన కో-ఆర్డినేషన్ కమిటీ సమావేశంలో ఆమె మాట్లాడుతూ ఈ నెల 25 నుండి 3 రోజులు పాటు శ్రీ దుర్గాలమ్మ అమ్మవారి ఉత్సవాలను అత్యంత వైభవంగా నిర్వహిస్తామని, అందుకు సంబంధించి అన్ని ప్రభుత్వ విభాగాలు సమన్వయంతో పని చేస్తాయని తెలియజేశారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులూ తలెత్తకుండా దేవాదాయ శాఖ, పోలీస్, జివిఎంసి సిబ్బంది తగు సహకారం అందివ్వాలని ఆదేశించారు. ప్రతిరోజూ పారిశుధ్య పరిస్థితులను మెరుగుపరచాలని, తాగునీటి సరఫరా చేయాలని జివిఎంసి అధికారులకు సూచించారు. భక్తుల సౌకర్యార్థం ప్రత్యేక క్యూ లైన్లు ఏర్పాటు చేయాలన్నారు. ఆలయ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ పైలా శేఖర్ బాబు మాట్లాడుతూ ఈ నెల 25న శ్రీ దుర్గాలమ్మవారి తోలేళ్ళ ఉత్సవాన్ని, 26న మహాశివరాత్రి పర్వదిన వేడుకలను, 27న అమ్మవారి జాతర ఉత్సవాన్ని నేత్ర పరంగా నిర్వహిస్తామన్నారు. ముఖ్యంగా శూలాల పండగ, అగ్నిగుండాలు తొక్కుట, సాంస్కృతి కార్యక్రమాలను నిర్వహిస్తామని తెలిపారు. దేవాదాయ శాఖ జిల్లా సహాయ కమిషనర్ అన్నపూర్ణ మాట్లాడుతూ ఉత్సవాలను ఎటువంటి లోటుపాట్లూ లేకుండా నిర్వహిస్తామని చెప్పారు.

భద్రతపై అశ్రద్ధ

- హెటిరోలో ఆగని ప్రమాదాలు

- యధాలాపంగా లోపాలు

ప్రజాశక్తి - అనకాపల్లి ప్రతినిధి

జిల్లాలోని ఔషధ పరిశ్రమల్లో వరుస ప్రమాదాలు భయంగొల్పుతున్నాయి. ఫార్మాలో ఎన్ని ప్రమాదాలు జరుగుతున్నా, ఎంతమంది చనిపోతున్నా, గాయాలపాలవుతున్నా ప్రభుత్వంగానీ, యాజమాన్యాలుగానీ పాఠాలు నేర్వడం లేదు. ప్రమాదాల నియంత్రణకు గట్టి చర్యలు తీసుకోవడంలేదు. మరోవైపు ప్రమాద నివేదికలు ఎక్కడా బయటకు రావడం లేదు. ఇది విస్మయం గొలిపే అంశం.

గతేడాది ఆగస్టు 21న అసెన్షియా ఫార్మా ప్రమాదంలో 17 మంది మృతిచెంది, 38 మంది గాయపడిన తరువాత ప్రభుత్వం నియమించిన ఉన్నత స్థాయి కమిటీ ఈ నాటికీ వెలుగుచూడలేదు. రెండు నెలల్లో నివేదిక ఇవ్వాల్సిన కమిటీ ఏమైందో తెలియని పరిస్థితి. పరిశ్రమల ప్రమాదాలపై ప్రభుత్వం ఉదాసీనంగా వ్యవహరించడంతో నియంత్రించే చర్యలు యాజమాన్యాలు తీసుకోవడంలేదు. నక్కపల్లి మండలంలోని హెటిరో డ్రగ్స్ కంపెనీలో మంగళవారం విష వాయువు లీకవడంతో భోజనం చేయడానికి క్యాంటీన్‌కు వెళ్తున్న 12 మంది అస్వస్థతకు గురయ్యారు. ప్రాణాపాయం లేకపోవడంతో అటు యాజమాన్యం, ఇటు ప్రభుత్వ యంత్రాంగం ప్రమాదాన్ని తేలిగ్గా తీసుకుంటున్నట్లు కనబడుతోంది. భద్రత, రక్షణ ప్రమాణాలను పాటిస్తే ఈ ప్రమాదం చోటుచేసుకొనివుండేదికాదు.

సోడియం హైపో క్లోరైట్‌కు హైడ్రో క్లోరిక్ యాసిడ్ (హెచ్‌సిఎల్) యాడ్ అయ్యే క్రమంలో వెలువడిన క్లోరిన్ గ్యాస్ (సిఎల్2) పక్కనున్న ఇటిపిలోని వ్యర్థాలకు చేరడంతో ఈ ప్రమాదం చోటుచేసుకుంది. విషవాయువులు బయటకు రాకుండా లీకేజీలను అరికట్టే చర్యలు చేపట్టగలిగితే ఈ ప్రమాదం కూడా చోటుచేసుకొనివుండేదికాదు. హెటిరోలో గతంలో ప్రమాదాలు జరిగిన సందర్భంలో మరణాలు సంభవించాయి. అయినా యాజమాన్యం ముందస్తు జాగ్రత్తలు, కార్మికుల్లో అవగాహన కల్పించే చర్యలు తీసుకోలేదు. 2022 ఫిబ్రవరిలో జరిగిన ప్రమాదంలో ఒక కార్మికుడు మృతిచెందగా, నలుగురు గాయపడ్డారు. ప్రెజర్ రిలీఫ్ వాల్వ్, రప్చర్ డిస్క్ ఏర్పాటు చేయకపోవడంతో రియాక్టర్ పేలినట్లు అప్పట్లో విచారణాధికారులు గుర్తించారు. హెటిరో యాజమాన్యం కార్మికుల భద్రతపై శ్రద్ధ తీసుకోదన్న విమర్శలు అప్పటి నుంచీ వినిపిస్తూనేవున్నాయి. 2013 జనవరి 5న జరిగిన ప్రమాదంలో నలుగురు, ఆగస్టు 14న జరిగిన ప్రమాదంలో ఒకరు, 2015 నవంబరు 10న ఒకరు, 2016 జూన్ 22న ఒకరు, 2020లో ఒకరు, 2022 ఫిబ్రవరి 23న ఒకరు ప్రమాదాల్లో చనిపోయారు. ఫార్మా కంపెనీల ప్రమాదాల నేపథ్యంలో భద్రతా ప్రమాణాల నిర్వహణపై 2020 జులై 16న అప్పటి ఉమ్మడి విశాఖపట్నం జిల్లా కలెక్టర్ వినయ్‌చంద్ నాలుగు బృందాలను నియమించారు.



కేర్ హాస్పిటల్‌లో క్షతగాత్రున్ని పరామర్శిస్తున్న లోకనాథం, కుమార్, మణి

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ నిబంధనల ప్రకారం పరిశ్రమల నిర్వహణ వుందా ? లేదా ?, అలాగే కార్మికులకు రక్షణ పరికరాల సరఫరా, కంపెనీలో భద్రతా ప్రమాణాల పాటింపు, ఫైర్ సేఫ్టీ, ఎలక్ట్రికల్ సేఫ్టీ వంటి పలు ప్రమాణాల అమలును పరిశీలించేందుకు, ప్రమాదాల నియంత్రణకు తీసుకోవాల్సిన ప్రత్యేక భద్రతా ప్రమాణాలపై నివేదిక ఇచ్చేందుకు అప్పట్లో బృందాలను నియమించారు. భద్రతా లోపాలను ఆ బృందాలు ఎత్తిచూపినా వాటిని సరిచేయకపోవడంతో ప్రమాదాలు జరుగుతూనే ఉన్నాయి.

నేడు పిడిఎఫ్ అభ్యర్థి విజయ గౌరి నామినేషన్

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానానికి యుటిఎఫ్ బలపరిచిన పిడిఎఫ్ అభ్యర్థి కోరెడ్ల విజయగౌరి గురువారం నామినేషన్ దాఖలు చేయనున్నారు. ఈ నేపథ్యంలో ఉదయం 11 గంటలకు సరస్వతి పార్కు నుండి కలెక్టరేట్ వరకు ప్రదర్శన ఉంటుందని యుటిఎఫ్ విశాఖ జిల్లా ప్రధాన కార్యదర్శి టిఆర్.అంబేద్కర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 12 గంటలకు నామినేషన్ వేస్తారని పేర్కొన్నారు. ఉత్తరాంధ్ర జిల్లాలకు చెందిన ఉపాధ్యాయులు అధిక సంఖ్యలో హాజరుకానున్నారని తెలిపారు.

‘ఆ భూమిపై అభ్యంతరాలుంటే తెలపండి’

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

విశాఖ జిల్లాలో గత ప్రభుత్వ హయాంలో జరిగిన భూ కేటాయింపులపై రాష్ట్రంలోని ‘కూటమి’ ప్రభుత్వం కొరడా ఝుళిపిస్తోంది. ఇప్పటికే మిగులు భూములు, ప్రభుత్వ డి పట్టా భూములపై జీవోలను జారీచేస్తూ ఎక్కడెక్కడ కేటాయింపులు జరిగాయో ఆరా తీస్తున్న విషయం తెలిసిందే. ఈ క్రమంలోనే ఆనందపురం మండలం కుసులవాడ గ్రామంలో సర్వే నెంబర్ 59(పి)లో 5 ఎకరాలను జగన్ ప్రభుత్వం 2023 డిసెంబర్ 15న చేసిన కేటాయింపులపై తాజాగా తహశీల్దార్ కార్యాలయం నుంచి పంచాయతీకి నోటీసును పంపింది. అప్పట్లో జరిగిన అలినేషన్ వివరాలపై ఎవరికైనా అభ్యంతరాలుంటే 15 రోజుల్లో తెలపాలని, అందుకు సంబంధించి దండోరా కూడా వేయాలని కుసులవాడ గ్రామ పంచాయతీ కార్యదర్శికి ఆనందపురం తహశీల్దార్ జి.హేమంత్‌కుమార్ నోటీసు పంపారు.

అప్పట్లోనే ‘ప్రజాశక్తి’లో కథనం

2019-2024 మధ్యకాలంలో విశాఖ దక్షిణం వైసిపి ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్‌కు చెందిన వైజాగ్ డిఫెన్స్ అకాడమీ కోసం జగన్ ప్రభుత్వం పై 5 ఎకరాలను కేటాయించింది. ఆ సందర్భంగా ‘వాసుపల్లికి భూ దక్షిణం’ అన్న శీర్షికన ప్రజాశక్తిలో కథనం ప్రచురితమైంది. తాజాగా కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టాక ఈ తరహా కేటాయింపులన్నింటిపైనా గ్రామ ప్రజల అభిప్రాయాలను కోరడం విశేషం.



రికార్డులను పరిశీలిస్తున్న కుమార్

ఎన్నికల కోడ్ ఉల్లంఘిస్తే చర్యలు తప్పవు

ప్రజాశక్తి-కొయ్యూరు : ఈ నెల 27న జరగనున్న ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యలో ఎన్నికల కోడ్‌ను ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని పాడేరు డివిజనల్ పంచాయతీ అధికారి పిఎస్.కుమార్ హెచ్చరించారు. స్థానిక ఎంపీడీవో ఎస్‌కెవి.ప్రసాద్‌తో కలిసి డిఎల్‌పిఒ బుధవారం మండలంలోని రాజేంద్రపాలెం, కొయ్యూరు పంచాయతీలలో విస్తృతంగా పర్యటించి ఎన్నికల కోడ్ అమలును పరిశీలించారు. కొయ్యూరు గ్రామ సచివాలయాన్ని తనిఖీ చేసి, సిబ్బందితో సమీక్ష నిర్వహించారు.

ఈ నెల 3న నోటిఫికేషన్ జారీ అయిందని, ఎన్నికల షెడ్యూల్ విడుదల చేసిన మరుక్షణమే మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ అమల్లోకి వచ్చిందని తెలిపారు. నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని పంచాయతీ రాజ్ ఉద్యోగులకు సూచించారు. అనంతరం రాజేంద్రపాలెం చెత్త నుండి సంపద కేంద్రాన్ని పరిశీలించి పలు సూచనలు చేశారు. తరువాత మండల పరిషత్ కార్యాలయంలో పన్నుల వసూళ్లపై సమీక్షించారు. ఎన్నికల కోడ్ ముగిసిన వెంటనే తాగునీటి సరఫరాపై పంచాయతీల వారీగా కార్యాచరణ ప్రణాళికలు రూపొందించాలని ఆదేశించారు. వేసవిలో తాగునీటి ఎద్దడి నివారణకు ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

ఉపాధి హామీలో అక్రమాలపై చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి-కొయ్యూరు : కొయ్యూరు మండలం, మర్రివాడ పంచాయతీ, దొడ్డవరం గ్రామంలో జరిగిన ఎన్ఆర్ఇజిఎస్ పనులపై మూడు సంవత్సరాలుగా సోషల్ ఆడిట్ నిర్వహించకపోవడం వెనక పెద్ద మొత్తంలో అవినీతి జరిగిందని అనుమానిస్తున్నట్లు సర్పంచ్ ఎం సత్యవతి, గ్రామస్తులు, ఉపాధి హామీ కూలీలు ఆరోపిస్తున్నారు. ఈ అక్రమాలపై విచారణ చేసి చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. బుధవారం వారు స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ ఈ పంచాయతీలో వీఆర్పీగా పని చేస్తున్న జుర్రా సత్తిబాబు కొన్ని సంవత్సరాలుగా సుమారు 33 మందికి పైగా ఉపాధి కూలీలు పనికి వెళ్లకుండానే మస్టర్ వేస్తూ వారి ఖాతాల్లో సొమ్ము జమ చేయిస్తున్నారని, వీరిలో ముగ్గురు పంచాయతీలో ఉండడం లేదని, హైదరాబాదులో కంపెనీ పనులకు వెళ్లిపోయారని పేర్కొన్నారు. ఈ విధంగా పనికి వెళ్ళని వారికి డబ్బు ఎలా జమ చేస్తున్నారని అధికారులను ప్రశ్నిస్తున్నారు.

సోషల్ ఆడిట్ విషయమై గతంలో ఏపీవో శ్రీనివాసకు ఫిర్యాదు చేయగా, వీఆర్పీ, ఏపీవో శ్రీనివాసు ఇరువురు వచ్చి గ్రామంలో ఒక ఇంటి వద్ద కూర్చుని సోషల్ ఆడిట్ రిపోర్ట్ తయారు చేసి తూతూ మంత్రంగా ముగించడం వెనక అంతర్యం ఏమిటనే విషయం ఉన్నతాధికారులే ప్రజలకు తెలపాలని వారు డిమాండ్ చేశారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి వీఆర్పీ జుర్రా సత్తిబాబు అక్రమాలను వెలికి తీసి, అక్రమంగా స్వాహా చేసిన సొమ్మును రికవరీ చేయాలని, అతన్ని విధుల నుంచి తప్పించాలని, అతని అక్రమాలను కప్పిపుచ్చిన ఏపీవో శ్రీనివాస్‌పై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేకుంటే గ్రామస్తులు, ఉపాధి కూలీలతో కలిసి మండల కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు.

అక్షరాస్యులుగా తీర్చిదిద్దాలి

ప్రజాశక్తి-కొయ్యూరు : గ్రామాల్లో ఉన్న నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దాలని వెలుగు ఎపిఎం అన్నారు. కొయ్యూరు మండల మహిళా సమాఖ్యలో వెలుగు విఒఎలకు ఉల్లాస్ కార్యక్రమంపై శిక్షణ కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎపిఎం మాట్లాడుతూ గ్రామస్థాయిలో నిరక్షరాసులకు చదువు నేర్పుటకు ఈ టీచర్స్ ట్రైనింగ్ ఇస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమానికి ఎంపీడీఒ, సీసీలు, విఒఏలు, గ్రామ స్థాయి ఉల్లాస్ టీచర్లు పాల్గొన్నారు